న్యూజెర్సీ కథ

# కన్నపేగు

– డాక్టర్ గంటి రామచంద్రమూర్తి

ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి లోపలికి వెళ్ళేందుకు ఓపికలేక వరండాలో కుర్చీలో కూలబడిపోయేను. నిస్సత్తువ, నీరసం, ఒళ్ళంతా కమ్మేసి కదిలేందుకు, పెదవి కదిపేందుకు బలం లేక అలాగే వుండిపోయేను. గేటు శబ్దం వింది కాబోలు అమ్మ లోపల నుంచి వచ్చింది.

"ఫెస్టివల్ అడ్వాన్స్ ఎంత వస్తుంది?" అమ్మ ప్రశ్నకి నివ్వెరపోయేను... ఒకప్పుడు రాగానే చేతికి వేడివేడి కాఫీ అందించేది.. ఇప్పుడు కనీసం మంచినీళ్ళైనా..."

""తమ్ముడికి జీతం నాలుగు వందలు కట్టాలి! చెల్లాయి ఎక్స్‌కర్షన్‌కి వెడతానంటోంది. ఆఖరి సంవత్సరం కదా! పంపిస్తే సరిపోతుంది. ఈ పదిరోజులుపోతే ఆవకాయ పెట్టుకోవాలి" యథాలాపంగాఏకరువు పెడుతోంది అమ్మ. "ఏం నేను మనిషిని కాదూ? నాకు కోర్కెలు వుండవూ?" మనసు మౌనంగా ఘోషిస్తోంది. ఏమీ మాట్లాడకుండా లేచి వెళ్ళి నా గదిలో బెడ్‌పైన వాలిపోయేను.ఇదివరకు గుండె పొంగి రెప్పల గండి తెగేది. ఇప్పుడు స్తబ్దతా, నిర్లిప్తతా అంటే రవ్వ కూడా కదలని వేసవి రాత్రయింది బ్రతుకు. అన్ని బంధాలని, అనుబంధాలని తెంచుకుని గువ్వలా ఎగిరిపోదామనిపిస్తోంది. అంతలోనే వాస్తవం ఊహని చూసి వెక్కిరిస్తుంది.

నాన్న రిటైరవ్వగానే చేరాను ఉద్యోగంలో. నాలుగేళ్ళయింది అక్క పెళ్ళి జరిగిపోయింది. తమ్ముడి పోస్ట్ గ్రాడ్యుయేషన్, చెల్లెలి గ్రాడ్యుయేషన్ ఈ సంవత్సరంలో ఆయిపోతుంది. ఇరవై ఎనిమిది నిండేయి నాకు పోయిన ఆదివారంతో. అందం వన్నె తగ్గి వయసు శరీరంమీద గుర్తులు వదిలిపెడ్తూంది. ఏం చేయను? వీళ్ళ దృష్టిలో కేవలం నేను డబ్బు సంపాదించే యంత్రాన్ని!"

'ఒంట్లో బావోలేదా వినూ!" అమ్మ ప్రశ్నకి తలెత్తాను.

"బాగానే వుందమ్మా" ఆవిడ గుమ్మం దగ్గర నుంచి కదలలేదు. అరనిమిషం తరువాత చెప్పింది "శైలు కంప్యూటర్ కోర్స్‌లో చేరింది. ఆరువేలు కట్టాలి"

"ఆరు వేలా?" వులిక్కిపడ్డాను.

అదేం పట్టించుకోకుండా చెప్పింది. "నీ పుణ్యమా అని సంసారం ఒక గాడిన పడింది..అదీ ఉద్యోగం సంపాదించుకుంటే కష్టం బరువు తగ్గుతుంది".

"నేను కూతుర్ని కాదా? మనిషిని కానా?

నా అవసరాలు వీళ్ళకి గుర్తుకు రావు, ఎంత సేపూ వాళ్ళ ఆలోచనే! మనసు ఉడుక్కుంటోంది. కానీ నేనేం సమాధానం చెప్పకపోవడంతో అమ్మ అక్కడినుంచి కదిలి వెళ్ళింది. ** ** **

** రాత్రి భోజనాలు అయ్యేక గదిముందు తారట్లాడుతున్న నాన్నని అడిగేను "ఏం కావాలి నాన్నా?"

"అమ్మ గొలుసు బ్యాంకులో పెట్టి చాలా రోజులైందమ్మా! అది విడిపించుకోవాలి!"

"ఎంత?"

"మూడువేలు".

"అలాగే.."

** ** ** **

రిటైరైన వెంటనే నాన్నగారు ఓ ప్రైవేటు కంపెనీలో చేరారు.మొదట్లో నా జీతం ముట్టుకోలేదు వాళ్ళు. చీరలు, డ్రెస్‌లతో బీరువా నింపేశాను. ఏడాది నుంచి అమ్మ డబ్బుల దిగి తీసుకోవడం మొదలుపెట్టింది. అప్పట్లో పెళ్ళి వద్దన్నాను. ఆర్థికపరమైన ఇబ్బందులేవి వుండవని వాళ్ళు చెప్పినా నమ్మలేదు నేను. నాకు చెప్పకుండా పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తే ఇంటికి ఆలస్యంగా వచ్చేదాన్ని. అదేమని ఎవరైనా అడిగితే "నాకిష్టం లేని పని చేస్తే అంతే!" అని బిరుసుగా జవాబు చెప్పేదాన్ని. ఇది జరిగి ఏడాదైంది. ఆతరువాత పెళ్ళిమాట ఎత్తడం మానేశారు.

అందరి అవసరాలు తీరుస్తూ, నాకంటూ ఏమీ మిగుల్చుకోకుండా, చివరికి నాకు కూడా నేను మిగలకుండా ఇలాగే వుండా పోతానా? అనురాగం, ఆప్యాయత, ఆదరణ వున్నన్ని రోజులు తోడు కావాలనించలేదు. ఇప్పుడు డబ్బే కేంద్రంగా మారిన స్థితిలో తోడు కోసం అలమటించిపోతోంది మనసు. ఏం చేయను? ఈ పంజరం నుంచి ఎలా తప్పించుకోను? నా అంతట నేను స్వయంగా ఎలా చెప్పగలను నాకు పెళ్ళి చేయమని? ఏం చేస్తే వీళ్ళ దృష్టి నా పెళ్ళి మీద మళ్ళుతుంది? ఆ క్షణంలో నాకు స్పానిష్ కవి పెడ్రో సాలినాస్ గుర్తుకి వచ్చేడు..

"జీవించేందుకు ద్వీపాలు, భవనములు, గుహలు దేనికి?

సర్వ నామాల్లో జీవించడంకన్నా వేరే సంతోషం ఏది?"

నిజమే ఒక నువ్వూ... నేనూ... ఆలోచిస్తే స్వార్థం... అనుభవిస్తే దాంపత్యం."

** ** ** ** మర్నాడు ఇంటికి ఆలస్యంగా వెళ్ళేను..

'ఏమ్మా ఆలస్యమైంది?" అమ్మ ప్రశ్నకి జవాబివ్వకుండా లోపలికి వచ్చేశాను. ఆ తరువాత వరసగా ఆరు దాటాకే రావడం ప్రారంభించేను. మొదట్లో 'మీటింగ్', 'పార్టీ', 'అక్కౌంట్స్ క్లోజింగ్' అని చెప్పేను. ఆ తరువాత నెమ్మదిగా గిరిధర్ గురించి..

"సిద్ధార్థహోటల్‌కి వెళ్ళాం అమ్మా.. కొద్దిగా కారం ఎక్కువ వేస్తాడు. గిరిధర్‌కి అలాగే ఇష్టం. నేను డ్రెస్‌లు మానేశాను గిరికి చీరలంటేనే ఇష్టం."
"అమ్మా గిరిధర్ కథలు కూడా రాస్తాడమ్మా!"

నాకు గిరి తోటిదే ప్రపంచమైపోయింది. అతని నామమే రామనామమైంది.

"అమ్మా...గిరి ఈ వేళ పార్టీ..'

"వాళ్ళు మనవాళ్ళేనా?" అమ్మ సూటిగా అడిగేసరికి తడబడ్డాను.

"ఊహు!.." కొంచెం ధైర్యం తెచ్చుకొని తలెత్తాను.

"వాళ్ళది మన మతం కూడా కాదు",

అమ్మ క్షణం మౌనంగా వుండిపోయింది. "నువ్వు ఎంచుకునే దారి ఫలితం నీ చెల్లెలి మీద కూడా వుంటుందని గుర్తుంచుకో వల్లీ! జీన్స్, టీషర్ట్ వేసుకొని ఆడపిల్ల బయటికి వెళ్ళగలుగుతోందని సమాజం మారిందనుకుంటే అది అపోహ!.. ఉప న్యాసాలిచ్చే వాళ్ళు శాఖాహారం కూడా ఒప్పుకోరు తెలుసా?"

అమ్మ వ్యాకులతకి అప్రయత్నంగా కళ్ళలో నీళ్ళు తిరిగేయి. కాని క్షణం సేపే. నేననుకున్నది సాధించినందుకు పెదవులపైన అప్రయత్నంగా చిరునవ్వు విచ్చుకుంది.

** ** ** ** సాయంత్రం ఆఫీసు వద లగానే పబ్లిక్ లైబ్రరీలో కాసేపూ, బీచ్‌లో కాసేపూ గడిపేను. అలవాటు ప్రకారం ఆలస్యంగా ఇంటికి చేరిన నాకు గుమ్మానికి వేళ్ళాడుతున్న తాళం కప్ప స్వాగతం పలికింది. అందరూ ఎక్కడికి వెళ్ళారని ఆశ్చర్యపడుతూ వరండాలోకి అడుగుపె ట్టాను. మేజ్‌మీద వుత్తరం.. గాలికి ఎగిరిపోకుండా దానిపై ఒక తాళం కప్ప..

వినూ,

నిన్ను నువ్వు మోసం చేసుకుంటూ గిల్టీగా ఫీలవ్వడం మాకు ససేమిరా ఇష్టం లేదు వల్లీ. పెళ్ళి పేరు చెబి తేనే మండిపడేదానివి నిన్ను కాదని సంబంధాలు తెస్తే అభాసుపాలు చేశావ్! నీ మనసులో ఎవరూ లేరన్నది నువ్వు చెప్పించే కదమ్మా!.. పిచ్చి తల్లీ వయసు మీరేక జరిగే ముచ్చట కాదమ్మా పెళ్ళి. కొట్టుకుపోయే పాతనీరు మేం నీకెన్ని రోజులు ఆసరా ఇవ్వగలం? తోడు లేకుండా నువ్వుండలేవని మాకు తెలీదూ? నిన్ను పెళ్ళికి సుముఖురాలిగా మార్చడానికి ఏం చేయాలో తోచక చివరికి మేమి ద్దరమూ ఈ నాటకం ఆడేము. డబ్బే ముఖ్యం అన్నట్టు ప్రవర్తించి నీ మనసును గాయపరిచేం. ఈ ముసలి వాళ్ళిద్దర్నీ క్షమిస్తావు కదూ! ఒంట రితనం అన్నది ఎంత భయంకరమైనదో నీకు తెలియజెప్పేందుకే మా ఈ ప్రయత్నం"..

నీటి తెర కట్టిన నా కళ్ళకి అయరాలు ఆన లేదు. అరనిమిషం తరువాత తిరిగి చదవడం మొదలు పెట్టేను.



"సంసారం గురించి దిగులు అక్కర్లేదు వల్లీ నీకు. మా రెక్కలు ఇంకా విరగలేదు కదా? నేను క్రెష్ నడి పించేందుకు నిర్ణయించుకున్నాను. మురళి, శైలజ ఇద్దరూ ఉద్యోగం చేస్తారు.. నువ్వు ఊహించిన స్వార్థం మాలో లేదమ్మా వినులూ! పుట్టినప్పుడు నీ ఉనికితో, ఆపైన నీ నడకతో, పరుగులో, నవ్వుతూ మమ్మల్ని ఎల్లప్పుడు సంతోషపెడుతూనే వున్నావ్.. నీ సంతోషం కంటే మాకేం కావాలి చెప్పు? అన్నట్టు పోయినవారం మన ఇంటికి వచ్చిన మురళి ఫ్రెండ్ రమేష్‌కి నువ్వు నచ్చేవ్.. నీకూ అతను నచ్చేడని నీ కళ్ళు, మా మనసులు చెబుతున్నాయి. ఇక ఆలస్యం దేనికి?

"మరి నీ 'గిరిధర్' సంగతి?.. ఊహల్లో మగవాడిని సృష్టించి వలపు మాలవేసి మమ్మల్ని అలజడిలో పెడితే నీ పెళ్ళి త్వరగా చేస్తాం అనేగా... నువ్వు చెప్పిన రోజు నుంచీ గిరిధర్ కోసం వెదుకుతూనే వున్నాం! ఎలా కనపడతాడు? అసలుంటేగా. అయినా నువ్వు కోరుకున్నవాడు నీకు దక్క కుండా కులమతాల అడ్డెలా చెబుతాం కన్నా! ప్రేమించినవాడిని ఇంటికి తీసుకువచ్చి మాకు పరి చయం చేయగల ధైర్యం సంస్కారం నీకున్నాయని మాకు తెలీదూ?
నీకు జన్మనిచ్చినవాళ్ళం.. నిన్ను అర్థం చేసుకోలేమూ?

-నీ

—అమ్మా, నాన్నా.

పక్కనే నా పేరు మీద ఇన్నేళ్ళ జీతానికి సరిపోయిన డబ్బు డ్రాఫ్ట్ రూపంలో...

నా గుండె పగిలి కన్నీరైంది. నిస్సత్తువగా కూలిపో తున్న నాకు మృదువైన, బలమైన ఆసరా.

"ష్" వంగి నా తలపైన ముద్దు పెట్టుకుంది అమ్మ.

"నన్ను క్షమించు అమ్మా.. క్షమించవూ! కళ్ళు శ్రావణ మేఘాలయ్యాయి.

"ఊర్కో తల్లీ" అంది.

"కన్నీరు చూపక కరుగునెడదల్లు"

"ఎన్నడూ నన్నిడిచి ఎడబాయనైతీ!

కన్న తల్లిలో నేను కడతేరు టెట్లూ!"

కన్నీళ్ళన్నీ ఖర్చు చేయకే విన్నా.. అప్పగింతల నాటికి కొన్ని మిగుల్చు...

'అమ్మా!!' ఆర్తిగా అల్లుకుపోయేను ఆవిడని.